నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శనివారం | ఏప్రిల్ 13, 2024 | www.navatelangana.com

ఉపాధి కూలీలకు తాగునీటి సరఫరా

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో రమ్యప్రసాద్ స్వచ్ఛంద సేవా సంస్థ(ఆర్‌పిఎఫ్)ద్వారా ఉపాధి హామీ కూలీలకు ఫిల్టర్ వాటర్ సరఫరా చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆ సంస్థ చైర్మన్ గురుప్రసాద్ యాదవ్, ప్రోగ్రాం ఇన్‌చార్జి సురేష్ మాట్లాడుతూ సేవా సంస్థ ద్వారా త్వరలో నియోజకవర్గంలో విద్య, వైద్యం, వ్యవసాయంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. మున్ముందు మరిన్ని ఉచిత సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తామని పేర్కొన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ - కాసిపేట



మండలంలోని మల్కేపల్లి ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థి మోదితే పవన్‌కుమార్ ప్రతిభ కనబరిచి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సీటు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం నరసింహ తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న అత్యుత్తమ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు నిర్వహించిన రెండో ఫేస్ పరీక్షలలో పవన్‌కుమార్ ఉత్తీర్ణత సాధించి భద్రాద్రి కొత్తగూడెం కిన్నెరసాని కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రవేశం పొందాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం అజ్మీర నరసింహ, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

సాగునీటి సంక్షోభం..!

- డెడ్‌స్టోరేజీకి చేరుకున్న పలు ప్రాజెక్టులు
- రబీ పంటలకు నిలిచిపోయిన నీటి సరఫరా
- వరదల ప్రభావం..పూడిక నిండిపోవడమే సమస్య

ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు బోసిపోయాయి. నీటి నిల్వ లేక నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. పలు జలాశయాలు ఎండిపోవడంతో నీటి సంక్షోభం తలెత్తే అవకాశం కనిపిస్తోంది. వివిధ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థ్యం లేకపోవడంతో ప్రస్తుత యాసంగి పంటలకు సాగునీటిని సరఫరా చేయలేని పరిస్థితి తలెత్తింది. వర్షాకాలం ప్రారంభంలో వరదలు సంభవించడంతో కిందకు వదిలేయడం..అనంతరం వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రాజెక్టుల్లో నీటి నిల్వ చేసుకోలేని పరిస్థితి తలెత్తినట్లు తెలిసింది. మరోపక్క ప్రాజెక్టుల్లో ఏండ్ల నుంచి మట్టి పూడికపోవడంతో నిల్వ సామర్థ్యం కూడా తగ్గినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఫలితంగా నీటి సంక్షోభం తలెత్తినట్లు తెలుస్తోంది. రబీ సీజన్‌లో పచ్చని పంటలతో కళకళలాడాల్సిన ప్రాంతాలు కరువు సీమలా కనిపిస్తుండటం అన్నదాతలను కలవర పెడుతోంది. మరోపక్క ప్రస్తుతం నిల్వ నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించాల్సి రావడంతో పంటలకు నీటిని నిలిపివేసినట్లు చెబుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పంటలకు జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టులు బోసిపోయినట్లు కనిపిస్తున్నాయి. ప్రతి వేసవిలో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నా ఈ ఏడాది మాత్రం నీటిమట్టం మరింత తీవ్రంగా దిగజారిపోయింది. ఉమ్మడి జిల్లాలో 80శాతం మంది రైతులు వర్షాధారం మీదనే ఆధారపడి పంటలు పండిస్తున్నా యాసంగి సీజన్‌లో మాత్రం ఆయా సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటితో రెండో పంటను పండిస్తున్నారు. కానీ ఈ సారి వర్షాకాలంలో సంభవించిన వరదల కారణంగా ప్రాజెక్టుల్లో నీటిని నిల్వ చేసే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలం ప్రారంభంలో భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టుల్లోకి సామర్థ్యం కంటే అధికంగా నీరు వచ్చింది. దీంతో అధికారులు వచ్చిన నీటిని వచ్చినట్లే కిందకు వదలాల్సి వచ్చింది. ముఖ్యంగా కడెం వంటి ప్రాజెక్టుకు సామర్థ్యం కంటే అధికంగా వరద రావడం.. గేట్లు పనిచేయకపోవడం మూలంగా నీరంతా వృథాగా వెళ్లిపోయింది. దీంతో ప్రస్తుతం సుమారు 60వేల ఎకరాల యాసంగి పంటలకు నీరందించలేని పరిస్థితికి చేరుకుంది. ప్రస్తుతం 2టీఎంసీలు మాత్రమే నిల్వ ఉండటంతో కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇలా సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. పంటలు చివరి దశలో ఉన్న సమయంలో నీరందించాల్సి రావడంతో ఈ ప్రాజెక్టుల నుంచి అక్టోబర్ నుంచే నీటిని విడుదల చేశారు. నెల రోజుల ముందుగా విడుదల చేయడం కారణంగా ప్రస్తుతం నీరివ్వలేని పరిస్థితి ఉంది. ఇక కుమురంభీం ప్రాజెక్టు పరిస్థితి కూడా ఇలాగే ఉంది. కిందటి వర్షాల కారణంగా మట్టికొట్టుకురావడంతో గేట్లు పనిచేయలేదు. ఫలితంగా నీటిని కిందకు వదిలారు. 10టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టుల్లో ప్రస్తుతం 4టీఎంసీలు మాత్రమే ఉంది. దీంతో కాల్వల ద్వారా నీటి సరఫరాను నిలిపివేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం 10టీఎంసీల నీరు నిల్వ ఉండాల్సి ఉండగా ఇతర అవసరాలకు వినియోగించడంతో ప్రస్తుతం 7టీఎంసీల నీటి నిల్వ ఉంది. దీంతో పంటలకు నీరివ్వలేని పరిస్థితి కనిపిస్తోంది. ఇలా మిగితా ప్రాజెక్టుల పరిస్థితి కూడా అధ్వాన్నంగా మారింది.

నిండుకున్న మట్టి..!

ఉమ్మడి జిల్లాలోని జలాశయాల్లో మట్టి పూడికపోవడం కూడా సమస్యగా మారుతోంది. నిబంధనల ప్రకారం ప్రతి ఐదేండ్లకు ఒకసారి ప్రాజెక్టుల్లో మట్టిని పూడిక తీయించాల్సి ఉండగా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆ శాఖ అధికారులు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఈ సమస్యపై దృష్టిసారించలేదు. ఫలితంగా ఆయా ప్రాజెక్టుల నీటి నిల్వ సామర్థ్యం ప్రతి ఏటా తగ్గుతూ వస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కడెం ప్రాజెక్టులో చివరి సారిగా 2012లో మట్టి తీయించగా.. ఇప్పటి వరకు మరోసారి తీయించలేదు. దీంతో కిందటేడాది వర్షాకాలంలో తీవ్ర వరదల కారణంగా మట్టికొట్టుకొచ్చి గేట్లు పనిచేయలేని పరిస్థితికి వచ్చింది. కుమురంభీం(అడ) ప్రాజెక్టు కూడా ఇలాగే మారింది. మిగితా వాటిలోనూ మట్టి నిండిపోయిన సమస్యలు ఉన్నాయి. ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఇప్పటికైనా దృష్టిసారించి ప్రాజెక్టులకు మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టులో తగ్గిన నీటి మట్టం



నీరు లేక బోసిపోయిన కడెం ప్రాజెక్టు

రాబోవు 50 సంవత్సరాల దృష్ట్యా జైళ్ల ఉన్నతీకరణ

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవి.రమేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సుప్రీం కోర్టు సూచనల మేరకు రాబోవు 50 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని జైళ్లను ఉన్నతీకరించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవి.రమేష్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో కమిటీ సభ్యులతో 2వ రోజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో ఉన్న జైళ్లను విస్తరించడం, ఉన్నతీకరించడం జరుగుతోందని, మోడల్ ప్రిసన్ మాన్యువల్ ప్రకారం కావలసిన సౌకర్యాలను కల్పించే కమిటీ సభ్యులకు నివేదిక అందించడం జరిగిందని తెలిపారు. శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ఆదిలాబాద్(2 సంవత్సరాలు పైబడినవారు) జైలుకు పంపించడం వలన వారి కుటుంబ సభ్యులకు ఆదిలాబాద్ వెళ్లడానికి చాలా దూర భారం అవుతున్నందున, జిల్లాలోని సౌకర్యాల కల్పన కోసం 2016 మాడ్యూల్ ప్రకారం నివేదిక తయారు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ జె.అనంతలక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) దాసరి వేణు, అదనపు ఎస్‌పి ఆర్.ప్రభాకర్‌రావు, ప్రత్యేక ఉపకారాగారం సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి.సతీష్ పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించండి



నవతెలంగాణ-కెరమెరి

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని డీఎస్పీ సదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు గ్రామాలైన గౌరి, బోలాపటార్, అంతపూర్, ముకధంగూడ, పరంధోలి గ్రామాల్లోని సరిహద్దు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీంగ్ కేంద్రాల వివరాలను గ్రామస్తులను అడిగి తెల్సుకున్నారు. సమస్యలున్నట్లైతే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సిఐ శ్రీనివాస్, ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ పోలీసులకు అందజేత



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని దేవీతండాకు చెందిన జాదవ్ హీరాలాల్ తనకు దొరికిన మొబైల్ ఫోన్‌కు పోలీసులు అందించాడు. నిర్మల్ నుండి తన గ్రామానికి రోడ్డు మార్గంలో వస్తుండగా మొబైల్ ఫోన్ దొరికింది. దాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పాడు. ఇటీవల జామ్ గ్రామానికి చెందిన తోకల శ్రీనివాస్ తన మొబైల్‌ను పోగొట్టుకున్నాడు. హీరాలాల్‌కు దొరికిన ఫోన్ శ్రీనివాస్‌దే కావడంతో శుక్రవారం ఎస్సై చంద్రమోహన్ దాన్ని శ్రీనివాస్‌కు అందజేశాడు. ఈ సందర్భంగా దొరికిన మొబైల్‌ను ఇచ్చిన జాదవ్ హీరాలాల్‌ను ఎస్సై అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-బోథ్

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ రమేష్, ఎస్ఐ రాము పాల్గొన్నారు.

రాముడి పేరుతో బీజేపీ రాజకీయాలు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న
- మూడు మండలాల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-తలమడుగు

బీజేపీ రాముడి పేరుతో రాజకీయాలు చేస్తూ ఓట్లు దండుకుంటోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని రయ్యాడి గ్రామంలో హస్నేన్ హుస్నేన్ ఫంక్షన్ హాల్‌లో తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ దేశానికి బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. రాముడి పేరు చెప్పుకొని హిందువుల ఓట్లు దండుకుంటోందన్నారు. ప్రజల అభివృద్ధికి చేసిందేమీ లేకపోగా వ్యతిరేక చట్టాలు చేస్తోందన్నారు. 350 మంది రైతులను చంపిన చరిత్ర బిజెపిది అని మండిపడ్డారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు దొందూదొందే అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలు అంటూ ప్రజల్ని మోసం చేసి అధి అధికారంలోకి వచ్చిందన్నారు. నెలలు గడుస్తున్నప్పటికీ గ్యారెంటీలు పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని పేర్కొన్నారు. రెండు లక్షల రుణమాఫీ, రైతుబంధు ఎక్కడా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ఓడిపోలేదు ప్రజలే ఓడిపోయారని సోషల్ మీడియాలో ప్రజలు మాట్లాడుకోవడం చక్కర్లు కొడుతున్నాయని తెలిపారు. బోథ్ నియోజకవర్గంలో 9మండలాల్లో అనిల్ జాదవ్ 24వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందాడని, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును కూడా ఇదే మెజారిటీతో గెలిపించుకుందామని పేర్కొన్నారు. సోయం బాపురావు బిజెపి ఎంపీగా జిల్లాకు ఏం చేశారో ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. నిన్నటి వరకు బీఆర్ఎస్‌లో పని చేసి బిజెపిలోకి వెళ్లి హిందువు నంటూ గొడెం నగేష్ ప్రజల ముందుకు వెళ్లడం సిగ్గుచేటని తెలిపారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ దేశంలో బీఆర్ఎస్ మాత్రమే అత్యధిక కార్యకర్తలు గల పార్టీ అని తెలిపారు. బిజెపితో దేశ ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రైతులు బాగుపడితే దేశం బాగుపడుతుందని, కానీ బిజెపి ప్రభుత్వం రైతుల ప్రాణాలు తీసిన ఘనత దక్కించుకుందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ తనలాగే ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును కూడా గెలిపించి పార్లమెంటుకు పంపించాలని కార్యకర్తలను, నాయకులను కోరారు. కార్యక్రమంలో భీంపూర్ జడ్పిటిసి సుధాకర్, నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, పార్టీ నాయకులు తుల శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, నిట్టడి గంగాధర్, గంగన్న, అభిరామ్‌రెడ్డి, మాజీ సర్పంచులు పోతారెడ్డి, ఆనంద్, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, కేదారేశ్వర్‌రెడ్డి, ఓయూ జేఏసీ అధ్యక్షుడు ఎల్చల దత్తాత్రి, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆర్‌ఎంపిలకు తక్షణమే శిక్షణ అందించాలి



నవతెలంగాణ-ముధోల్

ప్రభుత్వం సూచించిన నిబంధనలు ప్రకారమే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపి, పిఎంపి వైద్యులు ప్రథమ చికిత్సలు కొనసాగించాలని భైంసా డివిజన్ అధ్యక్షులు మోహన్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్ఎంపీల సమావేశంలో ఆయన మాట్లాడారు, గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల ఆరోగ్య రక్షణకు ఆర్ఎంపీ, పీఎంపీలు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఎంపీల సంక్షేమం కోసం తక్షణమే శిక్షణ అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆర్ఎంపీల శిక్షణ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రథమ చికిత్సలు నిర్వహిస్తున్న ఆర్ఎంపీలు వైద్య ఆరోగ్యశాఖ సూచనలను, నిబంధనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా ఆర్ఎంపిలు ఆరోగ్య రక్షణకు ఎంతో శ్రమ పడుతున్నారన్నారు. ఆర్ఎంపి, పిఎంపీలు అర్హత లేకున్నా తెలిసీ తెలియని వైద్య చికిత్సలు అందించినట్లయితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కేవలం ప్రథమ చికిత్సలు మాత్రమే నిర్వహించాలని ఈ సందర్భంగా సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్ముల సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్న గ్రామీణ వైద్యులను సంక్షేమ పథకాలలో భాగస్వాములు చేస్తూ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు శిక్షణను అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలకు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముధోల్ ఆర్ఎంపి అసోసియేషన్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, సీనియర్ ఆర్ఎంపి వైద్యులు గంగాధర్ చందనే, సాయిబాబా, సిద్ధిక్, సాయినాథ్, షకీల్, గంగాధర్, శేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-జైపూర్

మండలంలో శనివారం ఉదయం 9గంటల నుండి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33కెవి విద్యుత్ లైన్లో మరమ్మత్తులు చేపట్టాల్సిన కారణంగా కుందారం, జైపూర్, ఇందారం, పౌనూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఆర్టీసీ నిర్మల్ డిపో ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కనకాపూర్ బస్టాండ్‌లో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బైక్‌పై వెళుతున్న వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి బైక్ నడపాలని ఆర్‌టిసి సిబ్బంది కోరారు. కార్లు నడిపేవారు తప్పకుండా సీటు బెల్టు ధరించి రోడ్డు భద్రత సూచనలు పాటించాలని ఆర్టీసీ సిబ్బంది ఎల్. నర్సయ్య, డి.గంగన్న కోరారు. ఆర్టీసీ ప్రతి బస్సులో జీపిఎస్ సిస్టమ్ అమలులో ఉందని, ప్రతి ఒక్కరు ఫోన్‌లో ఆర్టీసీ గమ్యం యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులను బస్సు ఎక్కిస్తే యాప్ ద్వారా గమ్యం చేరుకున్నారా లేదా అనేది తెలుసుకోవచ్చని తెలిపారు.



బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-తలమడుగు

రుయ్యాడి బీఆర్ఎస్ గ్రామ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నిమ్మల సుదర్శన్‌రెడ్డి, అధ్యక్షులుగా బొజ్జ ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా ఉపేందర్, ప్రచార కార్యదర్శిగా గాజువాక నర్సింగ్, కార్యనిర్వాక అధ్యక్షులుగా నక్క గంగన్న, కోశాధికారిగా కుమ్మరి దేవేందర్, ప్రచార కార్యదర్శిగా సంద సుధాకర్ ఎన్నికయ్యారు. యూత్ అధ్యక్షులుగా నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శిగా బొంకంటి అశోక్, అధ్యక్షులుగా కుమ్మరి అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బేర వంశీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | ఏప్రిల్ 13, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-బేల



మండలంలోని రేణిగూడ గ్రామంలో తేనెటీగల దాడిలో గాయపడిన ఉపాధి హామీ కూలీలను శుక్రవారం యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ప్రస్తుతం వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట దౌన మాజీ సర్పంచ్ రాథోడ్ వినోద్, జితేందర్ ఉన్నారు.

ఎమ్మెల్యేని సన్మానించిన తర్నం గ్రామస్తులు

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో తర్నం గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వస్తున్న సందర్భంగా తర్ణం గ్రామానికి రావాలని ఆహ్వానించారు. వారి ఆహ్వానానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జుల సంతోష్, తర్ణం, గ్రామస్తులు పాల్గొన్నారు.



నేడు వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, మతోన్మాదం, భారత రాజ్యాంగ రక్షణకై వామపక్షాలు సీపీఐ(ఎం), సీపీఐ, సీపీ(ఎంఎల్) మాస్ లైన్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్టు వామపక్ష సంఘాల నాయకులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వామపక్ష సంఘాల నాయకులు పాల్గొని చర్చించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ శనివారం పట్టణంలోని బీసీ సంఘ భవనంలో నిర్వహించే ఈ సదస్సుకు సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కలవేణి శంకర్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు వి.ప్రభాకర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు టి.శ్రీనివాస్‌లు హాజరవుతున్నట్టు తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, వామపక్షాల కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి సి.అరుణ్ కుమార్, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యులు బి.జగన్‌సింగ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకట్ నారాయణ, వామపక్షాల నాయకులు బండి దత్త్రాత్రి, గణేష్, అన్నమొల్ల కిరణ్, బొజ్జ ఆశన్న పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీల్లో రూ.5లక్షల నగదు పట్టివేత



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని మలక్ చించోలి ఎక్స్ రోడ్డు వద్ద శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నిర్మల్ నుంచి మలక్ చించోలి వైపు వెళుతున్న గోసుకుల పోశెట్టి వాహనంలో రూ.3లక్షల 50 వేలు, స్వర్ణ వైపు నుంచి నిర్మల్ వెళుతున్న దేవి తండాకు చెందిన రాథోడ్ ప్రహ్లాద్ వాహనంలో రూ.లక్ష 50 వేలు ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళుతున్న నగదు లభ్యం అయినట్టు ఎస్సై చంద్రకాంత్ తెలిపారు. పట్టుకున్న మొత్తం రూ.5లక్షలను నిర్మల్ కలెక్టరేట్ గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్టు ఎస్సై తెలిపారు. ఈ తనిఖీల్లో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

నెలవారి మరమ్మతుల నిర్వహణలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ మండలంలోని బంగారిగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్ స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. పై సబ్ స్టేషన్‌ల పరిదిలోని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కడెం : కడెం సబ్‌స్టేషన్‌లో 33కేవీ లైన్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం 9గంటలనుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని కడెం విద్యుత్ శాఖ ఏఈ ఒక ప్రకటంలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని సీసీఐ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నమ్రత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. సబ్ స్టేషన్ పరిధిలో జీఎస్ ఎస్టేట్, తిర్పెల్లీ, బద్క మహోళ్ల, బ్రాహ్మణవాడ, పంజేషా ఏరియాలలో ఈ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

లక్ష్మణచాంద : మండలంలో 11 కేవీ విద్యుత్ లైన్‌ల గుండా ఎపుగా పెరిగిన చెట్ల తొలగింపు దృష్ట్యా చామన్‌పల్లి, పార్‌పెల్లి గ్రామాల పరిధిలో శనివారం ఉదయం 7గంటల నుంచి 12 గంటల వరకు, నర్సాపూర్ డబ్ల్యు, బాబాపూర్, బోరిగాం, న్యూకంజర్ గ్రామాల పరిధిలో సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ మహేష్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని సాలెవాడ(బి) గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు భక్తి మార్గాన్ని అలవర్చుకోని, ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు పుర్క బాపూరావు, మెస్రం శేఖర్ బాబు, ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పదేండ్ల బీజేపీ పాలనలో జిల్లాకు ఏం చేశారు..?

- ఈ నెల 16న జిల్లాకు కేటీఆర్ రాక
- మాజీ మంత్రి జోగు రామన్న



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదేండ్ల బీజేపీ పాలనలో జిల్లాకు ఏం చేశారని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ప్రశ్నించారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 16న గాయత్రి గార్డెన్‌లో నిర్వహించే బూత్ స్థాయి సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నారని అన్నారు. బూత్ స్థాయి కార్యకర్తలు పాల్గొనేలా మండల కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రికి స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు సమస్యలు విన్నవించిన పట్టించుకోలేదన్నారు. పదేండ్ల కాలంలో బీజేపీ జిల్లాకు చేసిందేమి లేదన్నారు. ఎన్నికల సమయంలో కేవలం రాముడు, భారత మాత పేరు చెప్పుకోని ఓట్లు తీసుకుంటున్నారని అన్నారు. తాము కూడా హిందువులను రాష్ట్రంలో ఎన్నో దేవాలయాలను నిర్మించామని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏ విధంగా వ్యవహరించాలో బూత్ స్థాయి కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లాకు రానున్నారని తెలిపారు. 16న పట్టణ శివారులోని గాయత్రి గార్డెన్ ఉదయం 10.30 నిమిషాలకు సమావేశం ఉంటుందన్నారు. బూత్ స్థాయి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జైనథ్, ఆదిలాబాద్ ఎంపీపీలు గోవర్ధన్, గంద్రత్ రమేష్, పార్టీ నాయకులు మనోహర్, రోకండ్ల రమేష్, నారాయణ, రాజు, జోగు మహేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలో హరిత రిసార్ట్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షులు మాట్లాడుతూ సదర్‌మాట్ ఆయకట్టు సరస్వతి కెనాల్ కింద వేసుకున్న పంటలకి నీరు అందక రైతులు పడుతున్న సమస్యలు తెలుసుకొని, నీటిని విడుదల చేయడంలో ప్రత్యేక చొరవ చూపిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు కాంగ్రెస్ మండల నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి మండల నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, బీజేపీ నాయకులు వారి రాజకీయ లబ్ది కోసం ఉపాధి హామీల కూలీలని తీసుకువచ్చి ధర్నాలు చేపట్టడం సరైంది కాదని అన్నారు. నీటి విడుదల విషయం తెలుసుకొని ముందుగానే ధర్నాలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ రైతులకు ఇబ్బంది కావొద్దని గతంలోనే అనేక సార్లు నీటి పారుదల శాఖ వారికి వివరించారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు చొరవ తీసుకోని, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జలకి ఇక్కడ రైతులు పడుతున్న సమస్యలని వివరించి ఆయకట్టు రైతులకి నీటిని వదలడం జరిగిందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టులపై వివక్ష చూపిందని అన్నారు. కాంగ్రెస్ రైతన్నలకి అండగా ఉంటుందని ఇతర పార్టీ నాయకుల మాటలు నమ్మొద్దని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం జీర్ణించుకోలేకనే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. విడుదల చేసిన నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అనుచరులు నీటి విడుదలపై గొప్పలు చెప్పుకోవడం దిగజారుడు తనానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు, మండల ముఖ్య నాయకులు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పశు వైద్యశాల ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి కిషన్

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి గ్రామంలోని పశు వైద్యశాలను జిల్లా పశు వైద్యాధికారి కిషన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పశు వైద్య సబ్ సెంటర్‌లోని రికార్డులను పరిశీలించి, పశువులకు సరిపడి మందులు అందుబాటులో ఉన్నాయా లేవ అని పశు వైద్యాధికారి దూద్ రామ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమాన్ని మండలంలో జరుగుతున్న తీరును మండల పశు వైద్య అధికారిని అడిగి తెలుసుకున్నారు. గాలికుంటువ్యాధి నివారణ టీకాలను మండలంలో 90శాతం పూర్తి చేసినట్టు డాక్టర్ దూద్‌రామ్ జిల్లా అధికారికి తెలిపారు. మిగతా పది శాతాన్ని ఏప్రిల్ 10 తేదీ వరకు పూర్తి చేయాలని జిల్లా పశువైద్యాధికారి కిషన్ మండల వైద్యాధికారిని ఆదేశించారు. జిల్లా పశువైద్యులు మండలంలోని అన్ని గ్రామాల్లో తప్పక పశువులకు టీకాలు వేయడం, పశు వైద్య సిబ్బంది ద్వారా ఈ నెల 15 తేదీ వరకు మిగిలిన గ్రామాల్లో వ్యాక్సిన్ వేయాలని కోరారు. రైతులకు సబ్సిడీపై గడ్డి కోత యంత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండల పశు వైద్య అధికారి ద్వారా తెలుసుకొని డీడీలు కట్టి తీసుకోవచ్చని తెలిపారు. జిల్లా పశు వైద్యాధికారి వెంట మండల పశువైద్యాధికారి దూద్‌రామ్, సిబ్బంది స్వామి, సుదర్శన్ ఉన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలి

- నియోజకవర్గ మైనార్టీ విభాగం పరిశీలకులు షబ్బీర్ పాషా

నవతెలంగాణ-కడెం

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కాంగ్రెస్ నియోజకవర్గ మైనార్టీ అబ్జర్వర్ షబ్బీర్ పాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అతి తక్కువ కాలంలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలంటే, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని అన్నారు. అందుకు నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. మైనార్టీ వర్గాన్ని చైతన్య పరిచి కాంగ్రెస్ మరింత పుంజుకునేల అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం షబ్బీర్ పాషాను కడెం మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ విభాగం అబ్జర్వర్ షబ్బీర్ పాషా, అబ్జర్వర్ టీం సభ్యులు సలీంఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేష్, పట్టణ అధ్యక్షులు వాజిద్ ఖాన్, మైనార్టీ మండల అధ్యక్షులు బబ్లు, వసిఉద్దీన్, ఆయాజ్, మక్బుల్ ఖాన్, మిర్జాబేగ్, షేర్పోద్దీన్, జావిద్, అత్తు, అఫ్రిది, సల్మాన్, ధర్మయ్య, ముస్కు రాజు, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

కొలాం ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలో అంకోలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని కొలాం ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా.సర్ఫరాజ్ మాట్లాడుతూ చిరు వ్యాధులు కలిగిన 49 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఎలర్జీ, తలనొప్పి, దురద, దెబ్బలు తగిలిన, జలుబు ఉన్నట్టు గుర్తించి వారికి మాత్రలను అందజేశారు. ఈ శిబిరంలో అంకోలి పీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, ఆరోగ్య కార్యకర్తలు నల్ల ఈశ్వర్‌రెడ్డి, పవర్ ప్రేమ్‌సింగ్, మరప ముయ్యాల మోతి, ఆశాలు చహకటి నర్మద, కె.సూర్య, స్కూల్ ఏఎన్ఎం అంజన, స్కూల్ ఇన్‌చార్జి సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

జొన్న పంటలో తెగుళ్ల యాజమాన్య పద్ధతులు చేపట్టాలి



నవతెలంగాణ-పెంబి

గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా జొన్న, నువ్వుల పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతుందని వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్ తెలిపారు. శుక్రవారం రోజున అంకెన, రాయదారి, పోచంపల్లి గ్రామాల పరిధిలోని వివిధ పంటల స్థితిగతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటలు గింజ గట్టిపడే దశ నుంచి కోత దశలో ఉందని, ముందుగా పంట కోసుకున్న వారు నూర్పిడి చేసిన ధాన్యం అకాల వర్షాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల కారణంగా గాలిలో పెరిగిన తేమ శాతం వల్ల జొన్న పంటలో గింజ బూజు తెగులు, కాటుక తెగులు, బంక కారుడు తెగుళ్ల వృద్ధి చెందే అవకాశం ఎక్కువగా ఉన్నందున జొన్న కంకులు లేతగా ఉన్న రైతులు లీటరు నీటికి 2 గ్రాముల మాంకోజెబ్ లేదా 1 మిల్లీ లీటర్ల ప్రాపికొనజోలు అనే మందు కలిపి ముందు జాగ్రత్తగా పిచికారీ చేసుకోవడం వల్ల వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. గింజ బూజు తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్న దశలో కంకులను చేను నుంచి వేరు చేసి, వేడి నీటిలో ఉడకబెట్టడం ద్వారా బూజు పక్క చెలకు వ్యాపించకుండా అడ్డుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు రవీందర్, చిన్ను పటేల్, భిక్కు, గణేష్, ఇందల్ పాల్గొన్నారు.

గమ్యం యాప్‌తో లాభాలు ఎన్నో : ఆర్ఎం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీ ప్రవేశపెట్టిన ప్రతీ కార్యక్రమాన్ని, ఆధునిక సంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ప్రయాణీకులకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తూ ఉంటుందని, అందులో భాగమే "గమ్యం"యాప్ అని ఆర్టీసీ ఆర్ఎం సొలొమాన్ తెలియజేశారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ అధికారులు, గమ్యం యాప్‌పై ప్రయాణీకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ఈ యాప్‌ను ప్రతీ ప్రయాణీకుడు కూడా గూగుల్‌ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకొని, ఆర్టీసీ బస్సు వివరాలు సులభంగా తెలుసుకోవచ్చని వివరించారు. ఈ యాప్ ప్రాముఖ్యతను ప్రయాణీకులకు సవివరంగా తెలియజేశారు. అదే విధంగా, ఆర్టీసీ బస్సులో ప్రయాణం ఎంతో సుఖవంతం, సురక్షితమని చెప్పుతూ రోడ్డు భద్రతపై ప్రయాణీకులకు అవగాహన కల్పించారు. ఆర్టీసీ సిబ్బంది, బస్ స్టేషన్, ఆదిలాబాద్‌లోని ప్రయాణీకుల స్మార్ట్ ఫోన్‌లో గమ్యం యాప్ డౌన్లోడ్ చేసి, దీన్ని ఎలా వాడాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్లు, ప్రణీత్, ప్రవీణ్ కుమార్, డిపో మేనేజర్, కల్పన ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. అనంతరం బీఆర్ఎస్‌కు చెందిన పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువలో మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని సాత్నాల క్వార్టర్స్ మురికి కాలువలలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమవడం కలకలం రేపింది. శుక్రవారం కాలువలో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వన్ టౌన్ పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడు చౌహన్ సంతోష్‌గా గుర్తించారు. అయితే అతను రోడ్లపై దొరికే సామాగ్రిని విక్రయిస్తు జీవనం సాగించే వాడని పోలీసుల విచారణలో తెలిసింది. అయితే మురికి కాలువలో ప్రమాదవశత్తు పడి చనిపోయాడా..! లేక హత్యచేశారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జైనథ్

గ్రామ దేవత పోచమ్మ తల్లిని పూజించిన తర్వాతనే మిగతా కార్యక్రమాలను చేపట్టడం తెలంగాణ రాష్ట్రంలో సంస్కృతి ఉందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మండలంలోని సాంగ్వి గ్రామంలో శుక్రవారం పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్టు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మయూర్ చంద్ర, అశోక్‌రెడ్డి, భూమన్న సురేష్, తరుణ్, వైభవ్, సురేష్, అశోక్ పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ సీజ్

నవతెలంగాణ-బెజ్జూరు



మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఒక గదికి అనుమతులు లేకుండా షెటర్ అమర్చినందుకు శుక్రవారం గదిని సీజ్ చేసినట్టు పంచాయతీ కార్యదర్శి తుకారాం తెలిపారు. అనుమతులు లేకుండా షాపింగ్ కాంప్లెక్స్‌లో గదికి షెటర్ బిగించారని, మూడు రోజుల క్రితం నోటీసులు జారీ చేశామని, అనుమతి పత్రాలు చూపించనందున షెటర్ సీజ్ చేసి గ్రామ పంచాయతీ ఆధీనంలోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. పంచాయతీ అనుమతి లేకుండా దుకాణ సముదాయాలను ఏర్పాటు చేసుకోకూడదని, అలా చేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కౌటాల



పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తలోడి గ్రామంలో జరిగింది. ఎస్ఐ మధూకర్ తెలిపిన వివరాల ప్రకారం నక్క నందకిశోర్(38) గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పెట్రోల్‌పంపులో కూలీగా పనిచేస్తూ నిత్యం మద్యం తాగుడు ఉండేవాడని, తాగిన మైకంలో గురువారం రాత్రి ఇంటిలో ఎవరికి తెలియకుండా పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లినట్టు, గమనించిన భార్య వరలక్ష్మి వెంటనే అతనిని చికిత్స నిమిత్తం సిర్పూర్ సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గవద బిల్లలతో 'గజగజ'

- రెండు నెలలుగా పెరుగుతున్న కేసుల సంఖ్య
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్





జిల్లా ప్రజలను గవదబిల్లలు (మమ్స్) రెండు నెలలుగా గజగజ వణికిస్తున్నాయి. రెండు నెలలుగా ఈ వ్యాధి బారిన పడి చిన్నారులు మంచానికే పరిమితం అవుతున్నారు. జిల్లాలో వందలాదిమంది చిన్నారులు ఈ వ్యాధికి గురవుతున్నారు.

వ్యాధి లక్షణాలు

వ్యాధి సోకిన వారికి చెవుల కింద దవడ భాగంలో వాపు రావడంతో పాటు, తల, కీళ్ల నొప్పులు, వాపు, నోరు తడారిపోవడం, ఆకలి మందగించడం, జ్వరం తదితర లక్షణాలతో బాధపడుతున్నారు. గొంతు సమీపంలో తీవ్ర నొప్పి ఉండడంతో చిన్నారులు భోజనం చేయలేకపోతున్నట్లు తెలుస్తోంది.

15 సంవత్సరాలలోపు పిల్లలకు

ఈ వ్యాధి ఎక్కువగా 15 సంవత్సరాలలోపు పిల్లలకు వస్తోంది. వ్యాధి లక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు. వ్యాధి పట్ల నిర్లక్ష్యం వహిస్తే చెవుడు వచ్చే అవకాశం ఉంటుందంటున్నారు. వ్యాధి వచ్చిన వ్యక్తి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు గాలిలో రేణువుల ద్వారా ఈ వైరస్ ప్రయాణించి మరొకరికి సోకుతుంది. 15 సంవత్సరాలలోపు పిల్లలకు ఈ వ్యాధి సోకగానే పాఠశాలల్లో వారికి తెలియకుండానే ఇతరులకు ఈ వ్యాధి వస్తుంది.

ఐసోలేషన్‌లో ఉంచడం మంచిది

వ్యాధికి గురైన పిల్లలను ఐసోలేషన్‌లో ఉంచడం మంచిదని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రెండు నెలలుగా ఆస్పత్రుల్లో మమ్స్ వ్యాధితో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. అయితే గవద బిల్లలు సోకిన వారిని వారం రోజులపాటు ఐసోలేషన్‌లో ఉంచితే వ్యాధి తీవ్రత తగ్గుతుందని చెబుతున్నారు.

వ్యాధి పట్ల నిర్లక్ష్యం వద్దు

సుధాకర్ నాయక్, డిప్యూటీ వైద్యాధికారి.



గవద పిల్లల వ్యాధిపట్ల నిర్లక్ష్యం చేయకూడదు. వ్యాధి సోకిన పిల్లలనుండి ఇతరులకు వ్యాధి సోకే అవకాశం ఉన్నందున వ్యాధికి గురైన పిల్లలను వారం రోజులపాటు ఇంట్లో ఉంచుకోవాలి. వైద్యులను సంప్రదించి సాధారణమైన మందులు అందిస్తూ తేలికపాటి ఆహారం అందించాలి పండ్ల రసాలు ఎక్కువగా ఇవ్వాలి. జిల్లాలో వ్యాధి నిర్మూలనకు సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు.

మన బస్సు వెళ్లేదెప్పుడో..?

- మహారాష్ట్ర నుంచి వచ్చే బస్సులే దిక్కు
- ఇక్కడి నుంచి నడిపించాలని కోరుతున్న ప్రయాణికులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రయాణికుల అవసరాలను గుర్తించిన మహారాష్ట్ర ఆర్టీసీ అధికారులు బస్సులను నడిపిస్తున్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల ట్రిప్పులను పెంచుతున్నారు. సిర్పూర్ మండలానికి మహారాష్ట్ర సరిహద్దు సమీపంలో ఉండడంతో ప్రయాణీకులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. దీన్ని గమనించిన మహారాష్ట్ర ఆర్టీసీ చంద్రాపూర్ నుండి బస్సు కొద్ది రోజుల నుండి నడుస్తుంది. దీంతో నిత్యం రెండు రాష్ట్రాల మధ్య ప్రజలకు సౌకర్యవంతంగా ఉంది. మహారాష్ట్రకు గత సంవత్సరం రెండు రైళ్లు వెళ్తుండేవి. దీంతో మహారాష్ట్రకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేది. ప్రస్తుతం రైళ్లు రైల్వే శాఖ నడిపించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించిన మహారాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్‌టీసీ ఉ బస్సులనే వేశారు. ఉదయం 10 గంటలకు, రాత్రి ఎనిమిది గంటలకు ఈ బస్సు నడిపిస్తున్నారు. రాత్రి సమయంలో వచ్చే బస్సు సిర్పూర్‌లో రాత్రి బసా చేసి ఉదయం ఐదు గంటలకు మహారాష్ట్రకు తిరిగి వెళ్తుంది. దీంతో ప్రయాణికులకు కొంత ఊరట కలుగుతుంది. తెలంగాణ, మహారాష్ట్రకు ఎక్కువగా సంబంధాలు ఉండడం వల్ల తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్రకు బస్సును నడిపించకపోవడంతో కేవలం మహారాష్ట్ర బస్సుపై ఆధారపడి ఉన్నారు. ఇప్పటికైనా మహారాష్ట్ర బస్సు ఏ విధంగానైతే రెండు పూటలు వస్తుందో తెలంగాణ ఆర్‌టీసీ సంస్థ కూడా రెండు పూటలు బస్సు నడిపిస్తే బాగుంటుందని ప్రయాణికులు సూచిస్తున్నారు. కుటుంబపరంగా, వైద్యపరంగా ఎక్కువగా రాకపోకలు ఉంటాయి. ఆర్‌టీసీ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకోని తమ సమస్యను గుర్తించి బస్సు నడిపించేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.



సిర్పూర్‌కు వస్తున్న మహారాష్ట్ర బస్సు

ఆర్‌టీసీ బస్సును నడిపించాలి

- దుర్గం ప్రశాంత్, సిర్పూర్ గ్రామస్తుడు



మహారాష్ట్రకు సిర్పూర్ సరిహద్దులో ఉండడం వల్ల ఇరు రాష్ట్రాల్లో కుటుంబ సంబంధాలు ఎక్కువగా ఉన్నాయి. వైద్యం కోసం మహారాష్ట్రలోని చంద్రాపూర్, సేవాగ్రాం, సవంగి పట్టణాలకు వెళ్తుంటాం. ఆర్‌టీసీ అధికారులు స్పందించి మహారాష్ట్ర బస్సు ఏ విధంగానైతే రెండు సార్లు వస్తుందో అలాగే తెలంగాణ ఆర్‌టీసీ కూడా బస్సును నడిపిస్తే బాగుంటుంది.

మహారాష్ట్రలోనే ఎక్కువ సంబంధాలున్నాయి

- ప్రదీప్, చిరువ్యాపారి, సిర్పూర్



మాకు మహారాష్ట్రలోనే ఎక్కువగా బంధువులున్నారు. నేను మహారాష్ట్రకు వెళ్లాలంటే అద్దె వాహనాలు తీసుకొని వెళ్లాల్సిన పరిస్థితి. గతంలో మహారాష్ట్రలోని బల్లార్షాకు రెండు రైళ్లు ఉదయం, మధ్యాహ్నం ఉండేవి. ప్రస్తుతం అవి నడవకపోవడంతో ప్రయివేటు వాహనాలను అద్దెకు తీసుకొని లేదా కాగజ్‌నగర్ నుండి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో వెళ్తున్నాం. ఇప్పుడు మహారాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టీసీ బస్సును నడిపిస్తున్నారు. దీంతో కొంత ఊరట ఉంది. ఆర్‌టీసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మహారాష్ట్రకు బస్సు నడిపించాలి.

ఖదీం ఈద్గా కమిటీ ఎన్నిక



సిర్పూర్(టి) : సిర్పూర్ ఖదీం ఈద్గా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జామా మసీద్ అధ్యక్షుడు రషీద్ హైమద్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జామా మసీద్‌లో ఖదీం ఈద్గా నిర్వహణ కోసం నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొహిజ్ హైమద్, ఉపాధ్యక్షుడిగా ఫహద్ హైమద్, కార్యదర్శిగా రిజ్వాన్ ఉల్లా ఖాన్, కోశాధికారిగా ముఖిద్, సభ్యులుగా అస్లాం బిన్ అబ్దుల్‌లతో పాటు పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈద్గాకు సంబంధించిన అభివృద్ధి పనులు కమిటీకి సంబంధించిన సభ్యులు అందరితో కలిసిమెలిసి తారతమ్యం లేకుండా ఐక్యతను చూపిస్తూ ముందుకు సాగుతామన్నారు. ఈద్గా వద్ద భవిష్యత్తులో జరిగే వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు.

ఇంకెన్నాండ్లు పడుతుందో..?

- తారు వేయడం మర్చిపోయిన గుత్తేదారు
- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. ఏ ఊరికి వెళ్లిన గతుకుల రోడ్లే దర్శనమిస్తున్నాయి. గుంతలమయమైన రోడ్లపై ప్రయాణం చేయలేక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. పై చిత్రంలో కనిపిస్తున్న ఈ రోడ్డు దహెగాం నుండి కాగజనగర్ వెళ్లే ప్రధాన రోడ్డు నుండి పెసరికుంటా గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు. ఈ గ్రామానికి గతంలో బిటి రోడ్డు ఉండగా భారీ వరదల కారణంగా రోడ్డు చాలా చోట్ల కోతకు గురికావడంతో పాటు గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వం పెసరికుంటా గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల వరకు నూతన రోడ్డుకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. సంవత్సరం గడుస్తున్నా సదరు గుత్తేదారు రోడ్డుపై కేవలం కంకర పోసి తారు వేయకుండా వదిలేయడంతో గ్రామస్తులు నరకయాతన అనుభవిస్తున్నారు. గ్రామస్తులు పదేపదే అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఇసుక మాఫియాను అరికట్టండి

- డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తం



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలో యధేచ్ఛగా ఇసుక రవాణా జరుగుతున్న రెవెన్యూ, భూగర్భ, పోలీస్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా దారులు విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణ చేస్తున్నారని, ఒకచోట ఇసుకను డంపింగ్ చేసుకొని ఇతర ప్రాంతాలకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వానికి చలాన్ కట్టకుండా ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని ఆరోపించారు. వీరికి తోడుగా మండలంలో ఉన్న రెవెన్యూ, పోలీస్ శాఖ మామూళ్లకు అలవాటు పడి ఇసుక దందా చేసే వారికి ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఇసుక దందా చేసేవారిని అడ్డుకొని భూగర్భ జలాలను కాపాడి ప్రభుత్వ ఖజనాకి గండి పడకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఇసుక రవాణా చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు వేయాలని డీవైఎఫ్ఐ గా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకుడు చాపిడి శివ, మండల ఉపాధ్యక్షులు చల్లూరి క్రిష్ణ పాల్గొన్నారు.

ప్రయాణికులకు నాణ్యమైన సేవలు

- డిపో మేనేజర్ విశ్వనాథ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు, స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన విచారణ నెంబర్ సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ విశ్వనాథ్ తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. బస్ స్టేషన్ పరిధిలో బస్సుల వివరాలు తెలుసుకోవడానికి ప్రయాణికుల సౌకర్యార్థం విచారణ నెంబర్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. ఇది 24 గంటలు పనిచేస్తుందని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. బస్ డిపో పరిధిలో ఉన్న ఇబ్బందులు తొలగించి ప్రయాణికులకు అనుకూలంగా బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకంతో బస్సుల ఆక్యుపెన్సి పెరిగిందని దానికి అనుకూలంగా బస్సులు ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని బస్సులు అందుబాటులోకి రానున్నట్లు వివరించారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్‌ల సమాచారం కోసం 7382840731 నెంబర్ ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. దీనిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర మంత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) నేడు జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో భాగంగా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడానికి ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం 9:30 గంటలకు రెబ్బెన మండల కేంద్రంలో సమావేశం నిర్వహించనున్నట్లు, అనంతరం 10:30 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఓటర్ల కోసం ఆరు యాప్స్..!

- ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక యాప్‌లు
- ఫిర్యాదులు వేగంగా పరిష్కారం..పోలింగ్ బూత్‌ల సమాచారం
- దివ్యాంగులకు వరంలా మారిన సరికొత్త ఫీచర్లు
- ఓటర్లు వినియోగించు కోవాలంటున్న అధికారులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఈసారి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో పౌరుల భాగస్వామ్యం పెంచేందుకు వివిధ రకాల మొబైల్ యాప్‌లను ప్రవేశ పెట్టింది. సువిధ, సీ-విజిల్, కేవైసీ, అబ్జర్వర్, సాక్షం, ఓటరు హెల్ప్ వంటి యాప్‌లతో పాటు నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టర్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎన్నికలకు సంబంధించిన సమాచారం, కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు, ఎన్నికల నియమావళి, ఓటర్లకు అవసరమైన సాయం, ఎన్నికల ఖర్చు, పోలింగ్ బూత్‌ల వివరాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల సమాచారం తెలుసుకునేందుకు ఈ యాప్‌లను ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టింది. ఎన్నికలకు సంబంధించిన అన్ని యాప్‌లు ప్రతీ ఆండ్రాయిడ్ మొబైల్లో ఉండే ప్లే స్టోర్లో లభ్యమవుతాయి. ఈ సమాచారం తెలుసుకోవాలనుకున్నా ప్లేస్టోర్ ఓపెన్ చేసి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఓటరు హెల్ప్ లైన్

ఓటరు హెల్ప్ లైన్ యాప్ ద్వారా కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా వివరాలు, ఎలక్టోరల్ జాబితాలో ఓటరు పేరు సెర్చ్ చేయడం, ఓటు వేసేందుకు అర్హత ఉందో లేదో నిర్ధారించుకునేందుకు ఈయాప్‌ను ఉపయోగించవచ్చు. డిజిటల్ ఫొటో ఓటర్ స్లిప్ డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఎన్నికలకు సం బంధించిన వార్తలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.



సువిధ

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నామినేషన్ అనుమతి ప్రక్రియలో సహా యపడేందుకు అభివృద్ధి చేసిన అప్లికేషన్ సువిధ. ఈ యాప్‌లో అభ్యర్థులు రిజిస్టర్ చేసుకొని, వారి ఆధారాలతో లాగిన కావాలి. తరువాత వారి నామినేషన్ల అనుమతి చూడవచ్చు. సువిధ యాప్ అభ్యర్థులకు అనేక ఇతర ఫీచర్లు అందిస్తుంది. ప్రచారానికి అవసరమైన అనుమతుల గురించి తెలుసుకోవచ్చు.

కేవైసీ

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. క్రిమినల్ కేసులు, వాటి స్థితి, నేరాల స్వభావం వంటి వివరాలు ఉంటాయి. నేర చరిత్ర ఉన్న అభ్యర్థులను గుర్తించేందుకు, వారికి ఓటు వేయకుండా ఉండేందుకు ఈ యాప్ ఓటర్లకు సహాయపడుతుంది.

దివ్యాంగులకు సాక్షం

పోలింగ్ రోజున వీల్‌ఛైర్ కోరేందుకు, పోలింగ్ స్టేషన్ తెలుసుకునేందుకు దివ్యాంగులకు తోడ్పడేలా సాక్షం యాప్లో అనేక ఫీచర్లు అందుబాటులో ఉంచారు. దృష్టిలోపం ఉన్న దివ్యాంగులకు వాయిస్ సహాయం అందిస్తుంది. టెక్స్ టు స్పీచ్ సదుపాయం కూడా ఉంది.

సీ-విజిల్

ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా ఈ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయొచ్చు. ఆడియో, వీడియో, ఫొటో ఏదో ఒక రూపంలో రికార్డు చేసి యాప్‌లో ఫిర్యాదు చేస్తే అధికారులు నిమిషాల్లో స్పందిస్తారు. వంద నిమిషాల్లో అధికారులు తప్పనిసరిగా స్పందించి ఘటనపై తగు చర్యలు చేపడుతారు. పార్టీలకతీతంగా ఎవరు కోడ్ ఉల్లం ఘించినా ఫిర్యాదులు చేయొచ్చు. డబ్బుల పంపకాలు, ఉచితాలు, బహుమతులు, రెచ్చగొట్టే ప్రకటనలు, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం వంటి ఉల్లంఘనలను ఫొటో, వీడియా, ఆడియో క్లిప్‌గా యాప్లో అప్‌లోడ్ చేయాలి. యాప్ తెరవగానే ఫొటో, వీడియో, ఆడియో అనే ఆప్షన్లు ఉంటాయి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. అధికారులు తక్షణం స్పందించి అక్రమాలను అరిక ట్టేందుకు కృషి చేస్తారు.

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ (ఎన్ఎస్పీ) ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఎన్నికల కమిషన్ సహాయపడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఓటరు తన మొబైల్ నంబర్‌ను ఉపయోగించి పోర్టల్లో ప్రొఫైల్ నమోదు చేసుకోవచ్చు. అలాగే దీని ద్వారా ఎన్నికల సంఘానికి పలు సమస్యలపై ఫిర్యాదులు చేయొచ్చు. నిర్ణీత వ్యవధిలోగా ఎన్నికల అధికారి స్పందించి సమస్య పరిష్కారం చూపుతారు. పోలింగ్ బూత్ ఉన్నచోట, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఎన్నికల ఖర్చు, అక్రమాలు వంటి వాటికి సంబంధించిన ఫిర్యాదులను ఈ యాప్ ద్వారా సకాలంలో పరిష్కారం పొందవచ్చు. పౌరులు తమ ఫిర్యాదులు ఏ స్థాయిలో ఉన్నాయో కూడా ఈ యాప్ లో పరిశీలించవచ్చు.

అబ్జర్వర్

ఎన్నికల కోడ్ దుర్వినియోగం, అక్రమాలకు సంబంధించిన కేసులను తెలు సుకునేందుకు వీలుగా అబ్జర్వర్లకు ఈ యాప్ ఉపయోగపడుతోంది. దీన్ని ఉపయోగించేందుకు ఎన్నికల పరిశీలకులు ముందుగా లాగిన్ క్రియేట్ చేసుకొని, వారి పాస్‌వర్డ్‌లో సమాచారం అందించాలి. అక్రమాలను అరికట్టేందుకు ఈ యాప్ చాలా ఉపయోగపడుతుంది. తమ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య, రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఉన్న ప్రదేశం వంటి సమాచారం పొందవచ్చు.

చికిత్స అందించి ప్రాణాన్ని కాపాడారు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన పురం శెట్టి లచ్చన్న తన ఇంట్లోని నుంచి గురువారం రాత్రి 12 గంటలకు ఆరు బయటకు రావడంతో అతని గుర్తు తెలియని విష పురుగు కుట్టింది. దీంతో తీవ్ర రక్తస్రావం అయింది. అతనిని వారి కుటుంబ సభ్యులు హుటాహుటిన జన్నారంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాత్రి ఒంటి గంటకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఇద్దరు ఏఎస్ఎంలు ఉండడంతో, డాక్టర్ ఉమాశ్రీ కి ఫోన్ చేయగా డాక్టర్ ఉమాశ్రీ సలహా సూచన మేరకు ఏఎస్ఎంలు సులోచన, వసంత చికిత్స అందించి అతని ప్రాణాలను కాపాడారు. సందర్భంగా లచ్చన్న కుటుంబ సభ్యులు, డాక్టర్ ఉమాశ్రీకి ఏఎస్ఎంలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఎస్పీ పట్టణ ఇన్‌చార్జిగా శంకర్

నవతెలంగాణ-నస్పూర్



బీఎస్పీ పట్టణ ఇన్‌చార్జిగా చంద్రగిరి శంకర్‌ను నియమిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పార్వంది రమేష్ చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా చంద్రగిరి శంకర్ మాట్లాడుతూ బీఎస్పీని బలోపేతం చేస్తానని, మహనీయుల ఆశయాల కోసం పని చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి కాదాసి రవీందర్, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు దుగుట రాజ్ కుమార్, బుద్ధి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ చేరికల్లో రభస

- భారీగా చేరిన బీజేపీ నాయకులు
- తమను గుర్తించడం లేదని ఆరోపణ



నవతెలంగాణ-రామకష్టాపూర్

కాంగ్రెస్‌లో శుక్రవారం బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున చేరారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తమకు గుర్తించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారం లేనప్పటి నుంచి తాము పార్టీని నమ్ముకొని పని చేస్తున్న గౌరవం దక్కడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే వివేక్ నాయకులను సముదాయించారు. అనంతరం పట్టణ బీజేపీ బీసీ మోర్చా మాజీ అధ్యక్షులు విరమల్ల రాజయ్య పార్టీకి రాజీనామా చేసి సుమారు 200 మంది స్థానికులు, తన అనుచరులతో కలిసి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు.

సభ చేరికల్లో రభాస

కాంగ్రెస్ పార్టీ చేరికల్లో భాగంగా పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అఫ్జల్ (లాడెన్) తనను ఎవరు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాల నుండి కాంగ్రెస్‌లో పనిచేస్తున్న తనను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఎన్నికలలో గెలిచినప్పటి నుండి తనను పట్టణంలో జరిగే పార్టీ కార్యక్రమాలు, సమావేశాలలో తనను అగౌరవపరుస్తున్నారని, ప్రోటోకాల్ పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలో లేనప్పటి నుండి తాము కష్టపడి చెన్నూరు నియోజకవర్గంలో పార్టీ గెలుపుకు తమ వంతు కషి చేశామని, నిన్న మొన్న పార్టీ కండువాలు మార్చి పార్టీలోకి వచ్చిన వారికి పెద్దపీట వేస్తున్నారని ఆరోపించారు. పార్టీ కష్ట కాలంలో పనిచేసిన వారిని గుర్తించాలని, స్థానిక నాయకులను, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని విజ్ఞప్తి చేశారు.

ఖురాన్ కంఠస్థం చేసిన ముగ్గురికి సన్మానం

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని మహమ్మదీయ మసీదులో శుక్రవారం నిసార్ అహ్మద్ ముగ్గురు కుమారులు ఉవేస్ అహ్మద్ షోయబ్, అబ్దుర్ రజాక్‌కు మహమ్మదీయా మజీద్‌లో మత పెద్దల ఆధ్వర్యంలో హాఫీజే ఖురాన్ కంఠస్థం చేసినందుకు గాను ఘనంగా సన్మానించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పిల్లలు హాఫిజే ఖురాన్ కావడం ఎంతో గర్వకారంగా ఉంది అని మత పెద్దలు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో మక్సూద్ శమీమ్, ఖుర్షిద్, సల్మాన్, ఇక్బాల్, అలీం, హాజీ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే పోలీసుల కవాతు

నవతెలంగాణ-బేల



శాంతి భద్రతల పరిరక్షణకే పోలీసుల కవాతు నిర్వహిస్తున్నామని ఎస్సై రాధిక అన్నారు. శుక్రవారం మండలంలోని సిర్సన్న, అవాల్‌పూర్ గ్రామాల్లో పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వేసేలా ప్రజలకు అవగాహన కలిగేలా ఈ కవాతు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఎస్సై సందీప్, బేల ఎస్సై రాధిక, జైనథ్ ఎస్సై పురుషోత్తం పాల్గొన్నారు.

హత్యా నేరంలో ఇద్దరికి జీవిత ఖైదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భర్తను హత్య చేసిన కేసులో భార్యతో పాటు ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ తీర్పునిచ్చారు. కౌటాల సీఐ సాదిక్ పాషా తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కొంతమంది కూలీలు సిర్పూర్ ఫారెస్ట్ రేంజ్‌లో ఇటికల పహాడ్ ఫారెస్ట్ బీట్‌లో ప్లాంటేషన్ పని నిమిత్తం ఇక్కడకు వచ్చారు. ఆ కూలీలలో మడావి దేవేందర్ అతని భార్య మడావి పార్వతికి, మడవి రామ్‌లాల్‌తో అక్రమ సంబంధం నేపథ్యంలో వారి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఒకరోజు మడావి దేవేందర్ పనికి రాకపోవడంతో ఇటికల పహాడ్ బీట్ ఆఫీసర్ కొట్టే నరేష్ వారి గుడిసెలకు వెళ్లి అతని భార్య మడావి పార్వతిని అడుగగా నా భర్త మడావి దేవేందర్ ఎక్కడికి వెళ్లాడో నాకు తెలియదని సమాధానం ఇచ్చింది. పక్కన ఉన్న వారిని కూడా అడగగా వారు నాకు తెలియదని సమాధానం ఇచ్చారు. సదరు బీట్ ఆఫీసర్ కొట్టే నరేష్ ఫిర్యాదు మేరకు చేసిన విచారణలో సదరు మడావి పార్వతి, మడావి రామ్‌లాల్ కలిసి మడవి దేవేందర్‌ను హత్య చేసి, మడావి రామ సహాయంతో మడావి దేవేందర్ మృతదేహాన్ని పూడ్చి పెట్టినట్టు ఒప్పుకున్నారు. సాక్షులను విచారించగా నేరం చేసినట్టు రుజువు కావడంతో నేరస్తులు మడావి పార్వతి, మడావి రామ్‌లాల్ జీవిత ఖైదు, రూ.2వేలు చొప్పున జరిమానా, మడావి రామకు రిమాండ్ కాలాన్ని శిక్షగా మార్పు చేస్తూ, రూ.వెయ్యి జరిమానా విధించడం జరిగిందని తెలిపారు.

మారుమూల గ్రామాలకు నిరంతర తాగునీటి సరఫరా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని మారుమూల గ్రామాలకు సైతం నిరంతర తాగునీటి సరఫరాకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలకు ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని జైనూర్ మండలం జంగాం గ్రామపంచాయతీలో 614 ఆవాసాలు, 2వేల 398 మంది జనాభా ఉండగా, గ్రామపంచాయతీ పరిధిలోని సడక్ గూడ గ్రామంలో 113 ఆవాసాలు, 576 మంది జనాభా ఉన్నారని తెలిపారు. జంగాం గ్రామపంచాయతీలో ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు 10 చేతిపంపులు, 7 మోటార్‌లతో కూడిన బోర్ వెల్స్, 4 మోటార్‌లతో కూడిన బహిరంగ బావులు, 1 మోటారు లేని, బహిరంగ బావి, మిషన్ భగీరథ పథకంలో 40 కెఎల్‌ఓ. హెచ్‌ఎస్‌ఆర్ 3, 20 కెఎల్. 5, 10 కెఎల్. 1, 20 కెఎల్‌జిఎల్‌ఆర్, ఆర్‌ఓ. ప్లాంట్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ క్రమంలో సంబంధిత అధికారుల సమన్వయంతో ఇంటింటికి తిరుగుతూ సంబంధిత తాగునీటి సరఫరా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



పోలీస్ అధికారులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించిన రామగుండం సీపీ శ్రీనివాస్

నవతెలంగాణ-జైపూర్

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. గంజాయి, కల్తీ కల్లు వినియోగం వల్ల కలిగే అనార్థలపై రూపొందించిన వాల్ పోస్టర్లను శుక్రవారం పోలీస్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్రంలో గంజాయితో పాటు కల్తీ కల్లు వినియోగం ద్వార వ్యక్తిగతంగా మాత్రమే కాదు, సమాజానికి నష్టం జరుగుతుందన్నారు. గంజాయి, కల్తీ కల్లు విక్రయాలకు పాల్పడితే ఫిర్యాదు చేయాలని సూచిస్తూ ఈ వాల్ పోస్టర్‌లో టోల్ ఫ్రీ నెంబర్‌తో కూడిన పోస్టర్లను అవగాహన కోసం రూపొందించామని తెలిపారు. గంజాయికి బానిసలుగా మారి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటుందన్నారు. మత్తుకు అలవాటు పడిన వారు తమ వ్యక్తిగత జీవితాలు మాత్రమే నష్టపోకుండా వారి తల్లి తండ్రులకు మానసిక క్షోభను మిగుల్చుతుందని పేర్కొన్నారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించిన వారికి సంబంధించిన సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని, గంజాయి రహిత పోలీస్ కమిషనరేట్ కోసం అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు.

రేపు అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయండి



నవతెలంగాణ-నస్పూర్

ఈనెల 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని మాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని నస్పూర్ మాల సంఘం అధ్యక్షుడు గోసిక మనోజ్ అన్నారు. శుక్రవారం మాల సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సీసీసీ కార్నర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి జెండా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదుట అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం సీసీసీ కార్నర్‌లోని అంబేద్కర్ విగ్రహం నుండి భారీ ర్యాలీగా బయలుదేరి సుందరయ్య కాలనీలో గల మాల సంక్షేమ సంఘం ఆఫీస్ వద్దకు చేరుకుంటుందన్నారు. బహుజనులు, సింగరేణి కార్మికులు, వ్యాపారస్తులు, యువతి, యువకులు, అంబేద్కర్ వాదులు, మహిళలు, నస్పూర్ మున్సిపాలిటీ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జవాజీ నందయ్య, సురిమిల్ల కిరణ్, ఓలేపు రవి, ప్రధాన కార్యదర్శి ధోనిపెల్లి శరణ్, ఆర్గనైజర్లు పండుగ శ్రీనివాస్, పీక సతీష్, ప్రచార కార్యదర్శి మునిమల్ల నవీన్, కార్యవర్గ సభ్యులు ధోనిపెల్లి లింగయ్య, అల్లునూరి కిరణ్, పీక శ్రావణ్, బందెల సురేందర్, మాసు మల్లేష్, మాసు శంకర్ పాల్గొన్నారు.

దాహార్తి తీర్చుకోవడానికి చలివేంద్రాలను ఆశ్రయించాలి

- ఎంపీడీఓ సత్యనారాయణ

నవతెలంగాణ-జైపూర్

ప్రయాణికుల దాహార్తి తీర్చడం కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సత్యనారాయణ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఏరియాలో ఏర్పాటు చేసిన చలివేద్రాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్‌తో కలిసి ప్రారంభించారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం ద్వార మంచిర్యాల, చెన్నూర్ మధ్య ప్రయాణిస్తున్న వారి దాహార్తి తీరుతుందన్నారు. వర్షా కాలం వచ్చే వరకు చలివేంద్రం కొనసాగుతుందని పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్ తెలిపారు.

గంగపల్లిలో...

గంగిపల్లి గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన పనులు పూర్తికావచ్చినట్లు ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. పైప్‌లైన్ చెడిపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడినందున పైప్‌లైన్ పనులు పునరుద్ధరించడంతో పాటు నీటి సరఫరా ప్రారంభిస్తామని తెలిపారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ పరిధిలో గల బోరుబావుల పని తీరును ఆర్‌డబ్ల్యూఎస్ విద్యాసాగర్‌తో కలిసి పరిశీలించినట్లు తెలిపారు.

జన్నారం : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం ఆ గ్రామ కార్యదర్శి లావణ్య ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి లావణ్య మాట్లాడుతూ ఈ చలివేంద్రం గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేయడంతో ప్రజలకు వినియోగించుకోవాలన్నారు. తిమ్మాపూర్, రాంపూర్, తాళ్లపేట వెళ్లే వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వేసవి దృష్ట్యా ఎండలు ఎక్కువగా ఉన్నందున, ప్రజల సౌకర్యార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ శ్రీనివాస్, మల్లేష్ పాల్గొన్నారు.



జైపూర్‌లో చలివేంద్రం ప్రారంభించిన ఎంపీడీఓ



జన్నారం : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తిమ్మాపూర్ గ్రామ కార్యదర్శి, సిబ్బంది

సింగరేణిలో ఇకపై అపరిమిత వైద్య సేవలు

- గుర్తింపు సంఘంతో సీపీఆర్ఎంఎస్ ట్రస్ట్ బోర్డుతో డైరెక్టర్ సమావేశం

నవతెలంగాణ-జైపూర్

రిటైర్డ్ సింగరేణి ఉద్యోగులు, కార్మికుల పట్ల సింగరేణి యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకుంది. సింగరేణిలో పదవీ విరమణ పొంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అపరిమితంగా వైద్య సేవలు అందించేందుకు అంగీకరించింది. ఇటీవల కొత్తగూడెంలో సీపీఆర్ఎస్ ట్రస్ట్ బోర్డుతో సమావేశమైన డైరెక్టర్ (పా) ఈ మేరకు అంగీకరించినట్లు గుర్తింపు సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. అదే విధంగా సింగరేణి ఉద్యోగుల పదవీ విరమణ రోజు సీపీఆర్ఎంఎస్ కార్డు ఇవ్వాలని కోరగా యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు. కాగా ప్రతి మూడు నెలలకు ఒకసారి ట్రస్ట్‌బోర్డు సమావేశం ఏర్పాటు చేయడానికి సమావేశంలో నిర్ణయించారు. దీర్ఘకాలిక వ్యాధులైన కాన్సర్, కిడ్నీ తదితర విషయంలో సీపీఆర్ఎంఎస్ కార్డు ద్వార రూ. 8 లక్షల వరకు వైద్య సేవలు అందించే వారు. తదరుపరి వైద్య సేవలకు ట్రస్టు ద్వార చెల్లింపులు జరిగేవి. ప్రస్తుతం కుదిరిన అంగీకారంతో సీపీఆర్ఎంఎస్ కార్డుకు సంబంధించిన రూ. 8లక్షలకు సంబంధం లేకుండా అవసరమైన మొత్తం ట్రస్టు బరించాలన్న డిమాండ్‌పై అంగీకరమైంది. కాగా 2018 నుండి ఇప్పటి వరకు మొండి జబ్బుల విషయంలో సీపీఆర్ఎంఎస్ కార్డు డబ్బులు రూ. 8 లక్షల నుండి ఖర్చు చేసిన సొమ్ము తిరిగి వారివారి ఖాతాల్లో వేయాలని ట్రస్టుబోర్డు సమావేశంలో నిర్ణమైనట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రిటైర్డ్ కార్మికులు వారివారి లైఫ్ సర్టిఫికెట్ జతపర్చకుండా ఉన్న సుమారుగా 5 వేల మంది వివరాలను ఏరియాల వారీగా గుర్తించి సమాచారం ఇవ్వాలని కోరారు. చాలా మంది కార్మికులు బీపీ, షుగర్ లాంటి జబ్బుల నెల వారి మందులు వారికి అందుబాటులో గల ఆస్పత్రుల్లోనే ఇవ్వడం, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి మందుల పంపిణీ అందుబాటులోకి తీసుకు రావడం కోసం నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు.

సానుకూలంగా స్పందించడం హర్షణీయం

- విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉప ప్రధాన కార్యదర్శి వేణుమాధవ్

గుర్తింపు సంఘంతో సమావేశమైన సింగరేణి డైరెక్టర్ (పా) రిటైర్డ్ సింగరేణి ఉద్యోగుల పట్ల సానుకూలంగా స్పందించడం స్వాగతిస్తున్నాం. సింగరేణి ఉద్యోగులు, కార్మికులు పదవీ విరమణ పొందిన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సింగరేణి ఉద్యోగంలో ఉన్న సమయంలో సంస్థ శ్రేయస్సు కోరి పని చేసిన ఉద్యోగులకు ట్రస్టుబోర్డులో తీసుకున్న నిర్ణయంతో కొంత ఉపశమనం కలిగింది. సింగరేణి యాజమాన్యం కూడా ఎప్పటికప్పుడు సానుకూలంగా స్పందిస్తూ సంస్థ కోసం శ్రమించిన రిటైర్డ్ ఉద్యోగులకు సహకరించాలి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-రెబ్బన

మండలం ఇందిరానగర్ గ్రామంలో గల నేషనల్ హైవేపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇందిరానగర్ గ్రామానికి చెందిన దుర్గం చిన్నయ్య(40) మృతి చెందాడు. వివరాలలోకి వెళితే.. ఇందిరానగర్ గ్రామానికి చెందిన దుర్గం చిన్నయ్య డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారుడ. శుక్రవారం ఉదయం ఎరుగటి వెంకటేష్‌తో కలిసి రెబ్బెనకు పని నిమిత్తం వెళ్లి తిరిగి ఇందిరానగర్ చేరుకున్నాడు. ఇందిరానగర్‌లోని నేషనల్ హైవే రోడ్డు దాటుతుండగా కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ వైపు నుండి రెబ్బెన వైపు వెళ్తున్న కారు చిన్నయను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన చిన్నయ్యను రెబ్బెన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లికు తరలించారు. అక్కడి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దుర్గం చిన్నయ్య భార్య లలిత ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన టీఎస్ 01ఈఈ6393 నెంబర్ గల కారు నడిపిన ఆశిష్ మల్లేష్ చెన్నూరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ పేర్కొన్నారు.

ఒకరిద్దరు మినహా...

- భీమారం మండలంలో బీఆర్ఎస్ ఖాళీ
- పార్టీని వీడిన 10 మంది మాజీ సర్పంచులు
- ఎంపీపీ, ఎంపీటీసీ మాత్రమే మిగిలారు...



కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-జైపూర్

నిన్న మొన్నటి వరకు బీఆర్ఎస్ పార్టీని అంటిపెట్టుకుని ఉన్న నాయకులు ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరేందుకు ఉత్సాహపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముగ్గురు సర్పంచులు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరగా శుక్రవారం మరో ఏడుగురు మాజీ సర్పంచులు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. భీమారం మండల పరిధిలో గల 11 గ్రామ పంచాయతీలకు గాను భూర్గుపల్లి సర్పంచ్ మినహా మిగితా 10 మంది కాంగ్రెస్ పార్టీతో జతకట్టారు. కాగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు భీమారం జెడ్పీటీసీ తిరుమల లక్ష్మణ్‌తో పాటు ఖాజిపల్లి ఎంపీటీసీ పెద్దల రూప బాపు కాంగ్రెస్‌లో చేరారు. మండల పరిధిలో 4 ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికల ఖర్చు వివరాలు ఇవ్వలేదని మద్దికల్ ఎంపీటీసీ ఎన్నికను రద్దు చేయగా మిగిలిన ముగ్గురు ఎంపీటీసీల్లో ఒకరు ఎంపీపీ కాగా మరో ఇద్దరు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న వారిలో ఎంపీపీ చెర్కు దీపికారెడ్డితో పాటు భూర్గుపల్లి మాజీ సర్పంచ్ వడ్డకొండ రమ తిరుపతి మాత్రమే మిగిలివున్నారు. కాగా గతంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మాజీ జెడ్పీటీసీ జర్పుల రాజ్‌కుమార్ నాయక్‌తో పాటు తాజాగా చేరిన మాజీ సర్పంచుల్లో ఒడేటి వాణి బలరామ్ రెడ్డి, కొడిపె సమ్మయ్య, తిరుపతి, సంతోషం భాస్కర్ రెడ్డి, దర్శనాల రమేష్, దుర్గం మల్లేష్, గద్దె రాంరెడ్డి, మాజీ సర్పంచులు బెల్లంకొండ నరేందర్ రెడ్డి, బనోత్ బన్సీలాల్, గొర్రెమేకల పెంపకం వృత్తిదారుల సంఘం అధ్యక్షులు కొమ్ము అశోక్, నరహరి మహేందర్ రెడ్డి, భూపెల్లి లచ్చయ్య, సురేష్ రెడ్డి, కాటారపు హరిబాబు, మంచాల క్రిష్ణమూర్తి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సమక్షంలో పార్టీలో చేరారు. వీరితో పాటు భీమారం గ్రామ పంచాయతీ కొత్తగూడెం కాలనీకి చెందిన పలువురు ఆదివాసీ నాయకులు (నాయకపోడ్) కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. వారికి ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కండువాలు వేసి ఆహ్వానించారు.

మొరం తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని జామ్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా మొరం తవ్వి తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను శుక్రవారం సాయంత్రం పట్టుకున్నట్టు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి రెవెన్యూ అధికారులకు అప్పజెప్పినట్టు ఎస్సై వెల్లడించారు.

ట్రాక్టర్ పైనుంచి పడి బాలుడు మృతి

నవతెలంగాణ-కడెం

ట్రాక్టర్‌పై నుంచి కింద పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం కడెం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఊరి శేఖర్ ఏడో తరగతి చదువుతున్న బాలుడు మొరం తీసుకువస్తున్న ట్రాక్టర్‌పై వస్తుండగా నడుస్తున్న ట్రాక్టర్‌పై నుంచి కింద పడటంతో ట్రాక్టర్ టైర్ ఎక్కి శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. శేఖర్ మృతితో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి.

సింగరేణిలో డిజిటలైజేషన్

నవతెలంగాణ-జైపూర్

సింగరేణిలో ఇకపై కాగితం కలంతో పని లేకుండా కాగిత రహిత కార్యకలాపాలకు యాజమాన్యం నిర్ణయం తీసుకుంది.. ఈ మేరకు సింగరేణి వ్యాప్తంగా డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించింది. ఇప్పటి వరకు ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ కాగితాలపై జరిగేవి. డిజిటలైషన్ పూర్తయితే కాగితం కలంతో పనిలేకుండా అంతా ఆన్‌లైన్ ద్వార పనుల నిర్వాహణ జరిగిపోనుంది. ఫలితంగా పనుల నిర్వాహణలో జాప్యం లేకుండా పోవడంతో పాటు ప్రతి విషయాన్ని కార్పోరేట్ లేవల్లో పనులన్నీ చకచక జరిగిపోనున్నట్లు తెలుస్తోంది. పనుల నిర్వాహణ మాత్రమే కాకుండా ప్రతి సింగరేణి ఉద్యోగికి సంబంధించి వివరాలన్నీ ఎక్కడికక్కడ అందుబాటులో ఉండనున్నాయని తెలుస్తోంది.

రేపటిలోగా దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

18 సంవత్సారాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఈ నెల 14వ తేదిలోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14వ తేది వరకు ఓటరుగా నమోదుకు ఇంకా రెండు రోజులే సమయం ఉన్నందున అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 1వ తేది వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకుల ఫారం నెంబర్ 6 నింపి సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు కొత్తగా ఓటర్ నమోదు కొరకు సమర్పించాలన్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్ దరఖాస్తు యాప్‌లో ఆధార్ కార్డు లేదా ఎస్ఎస్‌సీ మార్కుల మెమో ఆధారంగా కొత్త ఓటర్ల కొరకు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ మే 13న జరగబోవు పార్లమెంట్ ఎన్నికలలో తప్పకుండా పాల్గొని తమ ఓటును, తమ కుటుంబ సభ్యుల ఓటును వినియోగంచుకోవాలని తెలిపారు. నూతన ఓటర్లుగా జిల్లాలోని 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా, నిజాయితీగా, నిర్భయంగా ఓటు వేయాలని, పోలింగ్ శాతన్ని పెంచాలని కోరారు. ఓటరు జాబితా లో ఓటు ఉన్నది లేనిది పరిశీలించుకొని, లేని పక్షంలో ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు, ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాసిపేట : మండలంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొండాపూర్‌లోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.